నిరుపయోగంగా కంపోస్టు షెడ్డులు

- షెడ్ల కోసం రూ. కోట్ల నిధులు ఖర్చు
- కనిపించని కంపోస్టు ఎరువు తయారీ
- చెత్తను తగలబెడుతున్న సిబ్బంది
- ఎరువుల తయారీపై కొరవడిన అవగాహన



పారబోసిన చెత్తకు నిప్పు



చిన్నదేవాడలో నిరుపయోగంగా ఉన్న కంపోస్టు షెడ్డు

బిచ్కుంద(జుక్కల్): గ్రామాలను సుందరంగా తీర్చి దిద్దడంతో పాటు మౌలిక సౌకర్యాలు మెరుగుపర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం చెత్త సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో ఇంటింటా సేకరించిన చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేసి గ్రామ పంచాయతీలకు ఆదాయం పెంచాలనే మంచి ఉద్దేశంతో ప్రభుత్వం కంపోస్టు షెడ్డును నిర్మించింది. జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలలో షెడ్లను నిర్మించింది. ఒకటి రెండు చోట్ల మినహా అన్ని జీపీలలో నిర్వహణ లేక షెడ్లు నిరుపయోగంగా మారడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది. ఉన్నతాధికారుల నుంచి పంచాయతీ సిబ్బంది ఎవ్వరూ చెత్త సేకరణతో ఎరువు తయారీ వైపు దృష్టి పెట్టడం లేదు. షెడ్లు రికార్డుల్లోనే ఉన్నాయి తప్ప చెత్తతో ఎరువుల తయారీ ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.2.40 లక్షలు మంజూరు చేసింది.. ఎరువుల తయారీ మాత్రం ఆచరణలోకి రావడం లేదు.

తడి లేదు.. పొడి లేదు..

చెత్త సేకరణ కోసం వాహనాలు లేవని ప్రభుత్వం ప్రతి జీపీకి ట్రాక్టర్ సమకూర్చింది. నిత్యం ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్తను సేరించి పనికిరాని బట్టలు, ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్, మెటల్, ఎలక్ట్రికల్ వస్తువులు, గాజు ముక్కలు, కాగితాలు ఇతర వస్తువులు వేరు చేసి కంపోస్టు షెడ్డులో నిర్మించిన వాటిలో వేసి సేంద్రియంగా మార్చాలి. చెత్తను వేరు చేయడంలో సిబ్బంది పూర్తిగా విఫలమవుతున్నారు. ఎక్కడ కూడా గంప సేంద్రియ ఎరువు తయరు చేసిన దాఖలాలు లేవు. పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన చెత్తను నిప్పుపెట్టి తగలబెడుతున్నారు.

నిర్మించి నాలుగేళ్లు..

కంపోస్టు షెడ్డులు నిర్మించి నాలుగు ఏళ్లు అవుతున్నా ఎరువుల తయారీ ఎక్కడ కూడా ఆచరణలో సాధ్యం కావడం లేదు. దీంతో రూ.కోట్ల ప్రజాధనం వృథా అయ్యిందని ప్రజలు అంటున్నారు. సర్పంచులు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. గ్రామాలకు ప్రత్యేక అధికారులు వెళ్లి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులు ఏంటని చూడటం లేదని విమర్శలు వస్తున్నాయి. షెడ్డుల నిర్వహణ గురించి పట్టించుకోకపోవడంతో పంచాయతీకి ఆదాయం వచ్చే మార్గం లేదు. అధికారులు, అటు జీపీ సిబ్బందికి ఎరువుల తయారీపై అవగాహన కొరవడింది. ఇకనైనా కలెక్టర్ స్పందించి కంపోస్టు షెడ్డులో చెత్తను వేరు చేసి ఎరువు తయారయ్యే విధంగా చూడాలని తప్రజలు కోరుతున్నారు.

“ ఎరువు తయారు చేయాలని ఆదేశించాం

సేకరించిన చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాలని ఎన్సోసార్లు కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. ప్రతి జీపీలో చెత్త సేకరణ చేసి వేరు చేయాలి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. సరిగా లేకుంటే చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, డీఎల్‌పీవో, బాన్సువాడ

రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు



కుప్రియాల్‌లో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి, తదితరులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పేర్కొన్నారు. గురువారం కుప్రియాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని గోదాం నిర్మాణం కోసం 20 గుంటల భూమిని కేటాయించినందుకు ఎమ్మెల్యేను స్థానిక కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. అనంతరం సదాశివనగర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, మర్కల్, తిర్మన్‌పల్లి, పద్మాజీవాడి, యాచారం గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, విండో చైర్మన్ సదాశివరెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సంపత్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ సంగ్యానాయక్, మండల మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఇర్షాదొద్దిన్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అన్వేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం

ఎల్లారెడ్డిరూరల్: రానున్న టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన సమీక్ష సమావేశంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పాల్గొన్నారు. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ గెలుపు కోసం చేపట్టాల్సిన చర్యలు గురించి చర్చించినట్లు సమాచారం.

కిచెన్ షెడ్డా.. కారు పార్కింగా..!



సదాశివనగర్(ఎల్లారెడ్డి): విద్యార్థుల సౌకర్యార్థం ఓ దాత సహకారంతో నిర్మించిన కిచెన్ షెడ్‌ను అధ్యాపకులు కారు, బైక్ పార్కింగ్ కోసం వాడుతున్న దృశ్యం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 'సాక్షి' కెమెరాకు చిక్కింది. షెడ్‌లో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు కూర్చుని భోజనం చేయాల్సి ఉంటుంది. కానీ ఆ షెడ్‌లో ఎప్పుడు చూసిన సార్లకు చెందిన కార్లు, బైక్‌లు నిలపడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైన అధికారులు దృష్టి సారించి విద్యార్థులకు అసౌకర్యం కలిగించకుండా చూడాల్సిన అవసరముంది.

'కేసీఆర్' సినిమాను వీక్షించిన మాజీ ఎమ్మెల్యే



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలో గల రాంప్రతాప్ థియేటర్‌లో గురువారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ మండల బీఆర్ఎస్ నేతలతో కలిసి కేసీఆర్ సినిమాను వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావం తర్వాత జరిగిన అభివృద్ధిని సినిమా ద్వారా చక్కగా వివరించారన్నారు. 'కేసీఆర్' సినిమాను ప్రజలు వీక్షించాలని కోరారు. బీఆర్ఎస్ నేతలు ప్రతాప్ రెడ్డి, మండలాధ్యక్షుడు సిద్ధయ్య తదితరులున్నారు.

ధాన్యం సాగులో తెలంగాణ నెంబర్ వన్



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ రజితారెడ్డి

ఎల్లారెడ్డి: ధాన్యం పండించడంలో దేశంలో తెలంగాణ రాష్ట్రం నెంబర్‌వన్‌గా ఉందని ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజితారెడ్డి అన్నారు. గురువారం ఏఎంసీ కార్యాలయంలో కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో రైతులు చాలా ఆనందంగా ఉన్నారని, రుణమాఫీతో పాటు సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆమె అన్నారు. అలాగే ఏఎంసీలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి, వేబ్రిడ్జిల నిర్మాణానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. వైస్ చైర్మన్ రాజు, డైరెక్టర్లు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయండి



భిక్కనూరు : మాజీ సర్పంచులకు రావలసిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని జిల్లా సర్పంచుల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు గుడిసె రాములు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అప్పులు చేసి గ్రామాలలో అభివృద్ధి పనులు చేశామన్నారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. మాజీ సర్పంచులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం అర్థం చేసుకుని వెంటనే బిల్లులు చెల్లించాలని ఈ సందర్భంగా కోరారు.

ఈ దారిలో పోవాలంటే ముక్కు మూసుకోవాల్సిందే..!



రాజంపేట: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ, పోస్టఫీసు కార్యాలయాలకు వెళ్లాలంటే ఖాతాదారులు ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మురుగు నీరు తొక్కుకుంటూనే ఖాతాదారులు బ్యాంకు, పోస్టాఫీసు కార్యాలయాలలోనికి వెళ్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్లనే రోడ్లపైకి మురికి నీరు చేరుతుందని స్థానికులు వాపోతున్నారు. అధికార యంత్రాంగం చొరవ చూపి డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

గుంతల పూడ్చివేత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ గేట్ నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలను గురువారం కాంగ్రెస్ నాయకులు పూడ్చివేశారు. తాండూర్‌లోని త్రిలింగేశ్వరాలయం వద్ద జరుగనున్న రుద్రహోమం కార్యక్రమానికి వచ్చే భక్తులకు గుంతల వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గుంతలలో మొరం పోసి పూడ్చారు.

మొక్కలు బాగా పెరిగేలా చర్యలు తీసుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్: నర్సరీలలో మొక్కలు బాగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. గురువారం మండలంలోని రుద్రారం గ్రామంలో గల నర్సరీని పరిశీలించారు. మొక్కలు బాగా పెరిగేందుకు అవకాశమున్న మట్టిని బ్యాగులలో ఫిల్లింగ్ చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సిద్దు తదితరులున్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర గురుకుల కళాశాల, పాఠశాలలో గురువారం 5 నుంచి 10వ తరగతి చదువుతున్న 480 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను ప్రిన్సిపాల్ నందాల గంగాకిషోర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుమన్, ప్రముఖ వ్యాఖ్యాత, పద్యకవి బి.వెంకట్, ఉపాధ్యాయులు సంతోష్, నరహరి ప్రసాద్, రాము, సమీరా, మహమ్మదీ, గోవింద్, గంగాప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

పూలేకు ఘన నివాళులు



మాచారెడ్డిలో పూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేస్తున్న బహుజన నేతలు



కామారెడ్డిఅర్బన్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతీరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లాలో పలు చోట్ల గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు ఆయన చేసిన సేవలను కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్

నేడు త్రిలింగేశ్వరాలయంలో రుద్రహోమం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్ శివారులోని త్రిలింగేశ్వరాలయంలో శుక్రవారం రుద్రహోమం నిర్వహించనున్నారు. 101 జంటలు ఈ రుద్రహోమంలో పాల్గొననున్నారు. ఇందుకోసం గ్రామస్తులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు హాజరవనున్నారు. రుద్రహోమం ముగిసిన తర్వాత ఆలయం వద్ద సాయంత్రం కార్తీక దీపారాధన, ఆకాశ దీపోత్సవ కార్యక్రమాలను జరుపనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొమ్ము దత్తు తెలిపారు.

సాయి మందిరంలో ప్రత్యేక పూజలు

కామారెడ్డి రూరల్: ఉగ్రవాయిలోని షిరిడీ సాయి ప్రేమ మందిరంలో కార్తీక మాస చివరి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్న హారతి అంగరంగ వైభవంగా నిర్వహించారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యులు హిమబిందు

లింగంపేట(ఎల్లారెడ్డి): బాల్య వివాహాలు అరికట్టాలని లింగంపేట పీహెచ్‌సీ వైద్యులు హిమబిందు అన్నారు. గురువారం లింగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే నష్టాల గురిచి వివరించాలన్నారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తగు చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారి దివ్య చెప్పారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పలు గ్రామాలలో గల పల్లె దవాఖానాలలో బాల్య వివాహాలు అరికట్టాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 18 సంవత్సరాలలోపు పిల్లలకు ఎవరు వివాహాలు చేయవద్దని చెప్పారు. అలా చేయడం వల్ల ఆరోగ్యపరంగా ఇబ్బందులు కలుగుతాయని చెప్పారు. తల్లిదండ్రులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



తాడ్వాయి(ఎల్లారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలపై కళాబృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజాపాలన విజయోత్సవ సంబరాలలో భాగంగా గురువారం మండల కేంద్రంలో పలు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సబ్సిడీపై గ్యాస్, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదతర వాటిపై ఆట పాటల ద్వారా ప్రజలకు వివరించారు. కళాబృందం జిల్లా అధ్యక్షుడు రమేష్‌రావు, ఐండ్లరాము, డీవీఆర్ దేవయ్య, లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, జక్కుల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బకాయి రుణాలను వెంటనే వసూలు చేయాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా పొందిన రుణాలలో చాలాకాలంగా చెల్లించకుండా బకాయిపడిన రుణాలను వెంటనే వసూలు చేయాలని అదనపు డీఆర్‌డీవో మురళీకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం వీవోఏలతో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బకాయి రుణాలను వసూలు చేయడంలో నిర్లక్ష్యంగా వహించే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో డీపీఎం రవీందర్‌రావు, స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ కిరణ్, ఏపీఎం జగదీష్, అకౌంటెంట్ రాజు, సీసీలు పాల్గొన్నారు.

నేడు బీర్కూర్ ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: బీర్కూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం శుక్రవారం కొలువుదీరనుంది. ఏఎంసీ చైర్మన్‌గా శ్యామలతో పాటు వైస్ చైర్మన్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణస్వీకారానికి సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు రానున్నారు. ఏర్పాట్లను డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పరిశీలించారు.

దేవి విహార్‌లో కార్తీక దీపోత్సవం

కామారెడ్డి అర్బన్: దివ్యహస్తం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 29న శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి పట్టణ పరిధిలోని దేవీ విహార్ వీరాంజనేయస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధి చింతల పోచవ్వ తెలిపారు.

క్లుప్తంగా

పనులు వేగవంతం చేయాలి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి బస్టాండ్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. గురువారం బస్టాండ్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. మున్సిపల్ నిధులతో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కౌన్సిలర్లు నీలకంఠం, అల్లం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, విద్యాసాగర్ తదితరులున్నారు.

ఆర్థిక సాయం



రామారెడ్డి: పోసానిపేట గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామంలోని బాధితుడికి బాసటగా నిలిచి ఆర్థిక సాయం అందించారు. పోసానిపేట జీపీలో పని చేసే సుద్దాల బాలనర్సు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కమిటీ సభ్యులు గురువారం బాధితుడిని పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించారు. వీడీసీ అధ్యక్షుడు సాయిలు, ఉపాధ్యక్షులు గాండ్ల ప్రవీణ్, భాస్కర్ రెడ్డి, సాయిలు, బాలయ్య పాల్గొన్నారు

ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

భిక్కనూరు: మృతుని కుటుంబానికి ఎస్ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించింది. పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన జంగం కాశీనాథ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ విషయాన్ని గ్రామ సొసైటీ చైర్మన్ రాజగౌడ్ ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుభాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి బాధిత కుటుంబానికి రూ.10 వేలు పంపించారు. పెద్దమల్లారెడ్డి సొసైటీ చైర్మన్ రాజగౌడ్, వెంకట్, స్వామిగౌడ్, సుదర్శన్‌గౌడ్, స్వామి గౌడ్, తదితరులు ఉన్నారు.

దుకాణం దగ్ధమైన బాధితుడికి..

భిక్కనూరు: పట్టణానికి చెందిన అశోక్ నిర్వహిస్తున్న పాత ఇనుప సామాన్ దుకాణం ప్రమాదవశాత్తు కాలిపోయింది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు మండల బీజేపీ ఇన్‌చార్జి శ్రీధర్ రెడ్డి, అధ్యక్షుడు రమేష్ ఘటనా స్థలానికి వెళ్లి కాలిపోయిన వస్తువులను పరిశీలించారు. అనంతరం బాధితుడు అశోక్‌కు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మండల బీజేపీ ఉపాధ్యక్షుడు నరసింహులు, నాయకులు హరీష్, సురేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి



బాన్సువాడ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఫుడ్ సేఫ్టీ అధికారిణి శిరీష అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు, బియ్యంను ఆమె పరిశీలించారు. కాలం చెల్లిన వస్తువులను వాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యేక అధికారి దయానంద్, సిద్ధిరాములు ఉన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో పరిశీలన



భిక్కనూరు: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలని ఏబీవీపీ కామారెడ్డి పట్టణ కార్యవర్గ సభ్యుడు సమీర్ కోరారు. గురువారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులకు పెట్టే భోజనంలో చిన్న చిన్న ఇసుకరాళ్లు ఉంటున్నాయని, కూరలు రుచిగా ఉండడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. నాణ్యత పాటించకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఏబీవీపీ నాయకులు గంధం యోగేష్, రాజు, శివకృష్ణ తదితరులున్నారు.

సంక్షిప్తం

9వ సారి యువకుడి రక్తదానం


కామారెడ్డి అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన ఓ మహిళకు అత్యవసరంగా ఓ–పాజిటివ్ రక్తం అవసరం కావడంతో కామారెడ్డి రక్తదాతల సమూహం ద్వారా గురువారం ఎం. వంశీకృష్ణ అనే వ్యక్తి 9వ సారి రక్తదానం చేశారు. తెలిసిన వెంటనే రక్తదానం చేసిన వంశీకృష్ణను రక్తదాతల సమూహం వ్యవస్థాపకుడు బాలు, ఉపాధ్యక్షుడు పి.అనిల్‌కుమార్, వెంకటరమణలు అభినందించారు.

పేద బాలికలకు సైకిళ్ల పంపిణీ



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉత్తునూర్, గండిమాసానిపేట్, కామారెడ్డి గంజ్ ఉన్నత పాఠశాలల ఐదుగురు విద్యార్థులకు క్లబ్ అధ్యక్షుడు పి.రాజ నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియలు సైకిళ్లను పంపిణీ చేశారు. బాలికల సాధికారితలో భాగంగా హైదరాబాద్ నార్త్ రోటరీ క్లబ్, వెల్జాన్ సంస్థల సంయుక్త సహకారంతో ఉచితంగా సైకిళ్లను అందజేశారు. క్లబ్ ప్రతినిధులు శంకర్, నాగభూషణం, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ దశరథ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను పరిశీలించారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ సునీత, పంచాయతీ కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


ఫిజియోథెరపి క్యాంపు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని భవిత కార్యాలయంలో గురువారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం గల చిన్నారులకు ఫిజియోథెరపి వైద్యులు అరుణ్ పరీక్షలు చేశారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భవిత సిబ్బంది వెంకటేశం తదితరులున్నారు.

మద్దెల చెరువులో పశు వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. పశుగణన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మండల పశువైద్యాధికారి సంతోష్ మాట్లాడుతూ..శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లింగంపేట ఎస్సైగా సుధాకర్



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల ఎస్సైగా సుధాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నిజాంసాగర్ నుంచి బదిలీపై లింగంపేటకు వచ్చినట్లు తెలిపారు. గతంలో లింగంపేట ఎస్సైగా పని చేసిన అరుణ్ కుమార్ ఏసీబీకి పట్టుబడటంతో పోస్టు ఖాళీ అయ్యింది. ఆయన స్థానంలో సుధాకర్ బాధ్యతలు చేపట్టారు. ఏఎస్సై ప్రకాశ్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.